క్లుప్తంగా

మనసుకూ వ్యాయామం అవసరం



ఇసుకపల్లిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

కొత్తపల్లి: రోజువారీ శ్రమలో వ్యాయామం శరీరానికి మాత్రమే కాకుండా, మనసుకు కూడా అవసరమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నాగులాపల్లి, ఇసుకపల్లి సచివాలయాల్లో కిశోర వికాసంపై వేసవి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దుర్గారాణి మాట్లాడుతూ, క్రీడలు ఆత్మవిశ్వాసం, నాయకత్వం, స్నేహాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయన్నారు. బాలబాలికల తేడా లేకుండా ప్రతి బిడ్డకు ఆడుకునే హక్కు ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఎంత సంపాదిస్తున్నారన్నది కాకుండా, ఎంత ఖర్చు, పొదుపు చేస్తున్నారనే విషయాలపై నిర్దిష్ట ప్రణాళిక ఉండాలన్నారు. సైబర్ నేరాలపై 1930 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలలకు ఎటువంటి సమస్యలున్నా హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి అభిషేకాలు చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు అలంకరణలు జరిగాయి. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

శ్రీరాంపురంలో మన ఊరు-పనితీరు



ఉపాధి శ్రామికులతో సమావేశం

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో శుక్రవారం మన ఊరు-పనితీరు కార్యక్రమాన్ని ఎస్ఆర్పీ, డీఆర్పీలు ప్రారంభించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయం వద్ద గ్రామ ముఖచిత్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో కలిసి అధికారులు కాలువలో పూడికను తొలగించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ఏపీఓ కొండలరావు మాట్లాడుతూ, శ్రామికులకు వంద రోజుల పని కల్పించాలన్నారు. పని కావాలన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

దేశీయ సంస్కృతిలో వృక్షాలకు ప్రాధాన్యం

కాకినాడ రూరల్: భారతీయ సంస్కృతిలో వృక్షాలను పూజిస్తారని, ప్రతి ఒక్కరూ ఏటా మూడు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. వాకలపూడిలో శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం మెంబరు, జడ్జి చక్కా సుశీ, ఈషా వుమెన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి ప్రసంగించారు. ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటి, ర్యాలీ నిర్వహించారు.

పంచమంత్రం

- ప్రకృతి వ్యవసాయంలో ఐదు లేయర్ల విధానం
- పెట్టుబడి తగ్గడంతో రైతుల ఆసక్తి
- తక్కువ భూమి.. ఎక్కువ పంటలు
- నిత్య ఆదాయం, ఆరోగ్యకర పంటలు



కత్తిపూడిలోని ఓ పొలంలో ఐదు లేయర్ల సాగుకు సిద్ధం చేస్తున్న బెడ్లు



సిద్ధమైన బెడ్లు



సాగు చేస్తున్న పంటలు

పిఠాపురం: మనిషి పట్టుబడితే.. వనాలు పొలాలవుతాయి,. పొలాలు ప్లాట్లుగా మారతాయి. అదే మనిషి మనసు పెడితే.. బీడు భూములూ బంగారం అవుతాయి. పచ్చదనాన్ని పెంచుతూ.. సహజత్వాన్ని పంచితే ప్రకృతి ఆశీర్వదిస్తుంది. భూమికి మనం ఏది ఇస్తే.. అదే మనకు తిరిగొస్తుంది. వ్యవసాయం అంటే జీవరాశికి చేసే సాయం, ప్రస్తుతం రసాయన వ్యవసాయం చేయడం వల్ల తిరిగి.. వాటి దుష్ప్రభావాలే మనకు చేరుతున్నాయి. పంటలకు మందులు వాడుతుంటే, వాటి ఉత్పత్తులను తిన్న మనం మందులు వాడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దీనిని అధిగమించడానికే ప్రకృతిని కాపాడేందుకు.. ప్రకృతి వ్యవసాయమే మేలన్న విషయాన్ని తెలుసుకున్న రైతులు అందుకు మొగ్గు చూపుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో పంచతంత్రం ఫలిస్తోంది. సాలు దున్ని ఒకే రకమైన పంటలు పండించే సాధారణ వ్యవసాయం కాదు. ఈ విధానంలో పలుసార్లు దున్నే అవసరం లేదు. కూలీల అవసరం అంతంతమాత్రమే, ఎరువులు వేసే అవసరమూ చాలా తక్కువ. ఒక రకంగా చెప్పాలంటే ఇదోకరకమైన అటవీ వ్యవసాయం. అడవిలో చెట్లూచేమలు, పక్షులూవృక్షాలు ఇలా అన్ని రకాల జీవరాశులు ఒకదానికి ఒకటి పరస్పరం పెంచి పోషించుకున్నట్టే.. ఒక పంట మరో పంటకు బలాన్నిచ్చి, వరుసగా ఆదాయాన్నిచ్చే ఐదు లేయర్ల పంటల విధానమే ప్రకృతిలో పంచతంత్రం వ్యవసాయం. దీనిని అటవీ వ్యవసాయం అని కూడా పిలుస్తారు. సాగు దిగుబడి ఆదాయం అన్ని వాటంతట అవే పెరుగుతాయి. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఐదు లేయర్ల వ్యవసాయం రోజురోజుకూ పెరుగుతోంది.

పండించే పంటలు

మొట్టమొదటి లేయర్ (పొర)లో అరటి, దానిమ్మ, మామిడి వంటి పెద్ద చెట్లను నాటవచ్చు. రెండో లేయర్‌లో కాఫీ, కోకో వంటి చిన్న చెట్లను నాటవచ్చు. మూడో లేయర్‌లో నల్ల మిరియాలు, వెల్లుల్లి వంటి లతలు లేదా పొదులు నాటవచ్చు. నాలుగో లేయర్‌లో అల్లం, బంగాళాదుంప వంటివి పెరుగుతాయి. ఐదో లేయర్‌లో ఆకుకూరలు, కూరగాయలు వంటివి నాటవచ్చు. ఈ పద్ధతిలో, ప్రతి లేయర్ పంటలు ఒకదానికొకటి సహాయపడి.. భూమిని సమతుల్యం చేస్తాయి. పెద్ద చెట్లు నీడను సృష్టించి చిన్న చెట్లను లతలను రక్షిస్తాయి.

వ్యవసాయం ఇలా..

ఎకరం పొలంలో 60x60 అడుగుల సైజులో పది బాక్సులుగా విడదీస్తారు. ఒక బాక్సులో నీటి నిల్వ కోసం చెరువు తవ్వుతారు. మిగిలిన బాక్సుల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. ఈ బాక్సుల్లో వరుసగా కాలువలు తవ్వి మట్టితో బెడ్లు తయారు చేస్తారు. వాటిపై బహు వార్షిక పంటలైన మామిడి, కొబ్బరి, జామ, నిమ్మ, నారింజ, అరటి వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఈ మొక్కల మధ్య ఖాళీల్లో చేమ, అల్లం, పసుపు, బీట్‌రూట్, కేరట్, కంద, ముల్లంగి, వంగ, టమాటా, తీగ జాతి తదితర పంటలతో పాటు, ఆకుకూరలు సాగు చేస్తుంటారు. బహు వార్షిక పంటల నుంచి వార్షిక పంటలు రోజు, వారం, నెల ఇలా వరుసగా అన్ని వేళలా ఆదాయాన్ని ఇచ్చే విధంగా ఎకరం పొలంలో సుమారు 50 రకాల పంటలు పండిస్తుంటారు. ఈ పంటలతో పాటు పశువులు, కోళ్లు వంటివి పెంచుతారు. పశువుల వ్యర్థాలు, చెట్ల ఆకులు, పంటల వ్యర్థాలే ఎరువులుగా ఉపయోగిస్తారు. పశువుల మూత్రం, పేడ వంటి వాటితో కషాయాలు తయారు చేసి మందులుగా వాడతారు. ఇలా అన్ని ఎక్కడా కొనుగోలు చేయకుండా వాటంతట అవే ఎరువులుగా, పురుగు మందులుగా ఉపయోగపడి, పెట్టుబడి తక్కువగా ఉండి నిత్యం ఆదాయం వస్తుంది.

మాగాణీల్లో నిత్య పచ్చదనం

సాధారణంగా మాగాణి అంటే వర్షాధార భూములు. ఇందులో పంటలు వర్షంపైనే ఆధారపడి ఉంటాయి. అలాంటి మాగాణీల్లో ఇప్పుడు నిత్యం పచ్చదనం తొణికిసలాడుతోంది. ఐదు లేయర్ల విధానంలో పంటలు సాగు చేయడం వల్ల భూమి ఎప్పుడూ తేమతో ఉండి, నీటి అవసరం అంతగా లేకపోవడంతో పాటు, ఎప్పుడూ పచ్చని పంటలు పండుతుండడంతో మాగాణీలు వ్యవసాయంలో మణిహారాలుగా మారుతున్నాయి. ఎండాకాలంలో ఖాళీగా కనిపించే మాగాణీలు ఇప్పుడు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ఎక్కువగా ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీటిని చేపట్టారు. ఇప్పటికే సుమారు వంద ఎకరాల్లో ఈ పద్ధతిలో పంటలు సాగు చేస్తుండగా, ఈ ఏడాది మరింత సాగు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

నిత్యం ఆదాయం



ఐదు లేయర్ల పంటల సాగుతో నిత్యం ఆదాయం వస్తుంది. భూమి సారవంతంగా ఉంటుంది. ఎరువులు, పురుగు మందులు సొంతంగా తయారు చేయడం వల్ల పెద్దగా పెట్టుబడి ఉండదు. తొలుత భూమిని సిద్ధం చేసేటప్పుడు మాత్రమే పెట్టుబడి అవుతుంది. అక్కడి నుంచి రైతుతో పాటు, ఒకరిద్దరు కూలీలు సరిపోతారు. ఈ పద్ధతిలో సాగు చేసిన కేవలం నెల రోజుల నుంచి పంటలు అందుబాటులోకి వచ్చి ఆదాయం ప్రారంభమవుతుంది. ఇంట్లోకి కావాల్సి ఆకుకూరలు, కూరగాయలు, ఇతర పంటలన్నీ అందుబాటులోకి రావడంతో పాటు, పంటలను విక్రయించడం ద్వారా నిత్యం ఆదాయం వస్తుంది. పెట్టుబడికి అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. ఆరోగ్యకరమైన పంటల వల్ల ఎక్కువ ఆదాయం వస్తుంది. ఎక్కువగా మాగాణీల్లో వీటిని చేపడుతున్నారు. విత్తనాలు సరఫరా చేస్తున్నాం. కొత్తగా సాగు చేపట్టిన రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎప్పటికప్పుడు సూచనలు ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. ఈ ఏడాది వంద ఎకరాల్లో ఈ విధానంలో సాగు లక్ష్యంగా నిర్ణయించాం. – ఎలియాజరు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయ శాఖ, కాకినాడ

అపర్ణాదేవికి 'మామిడి' అలంకరణ



మామిడి పండ్ల అలంకారంలో అపర్ణాదేవి అమ్మవారు

పిఠాపురం: జ్యేష్ఠ మాసం శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు మామిడిపండ్ల అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి ఏటా జ్యేష్ఠ మాసంలో మామిడి పండ్లతో అలంకరించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



పంచారామ క్షేత్ర ఆవరణలో యోగా శిబిరంలో జేసీ, ఎమ్మెల్యే తదితరులు

- జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా
- పంచారామ క్షేత్రంలో యోగా శిబిరం

సామర్లకోట: ప్రతి ఒక్కరికీ యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. శుక్రవారం స్థానిక పంచారామ క్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేడు ప్రతి ఒక్కరికీ యాంత్రిక జీవనం అలవాటైందన్నారు. దగ్గరలో ఉన్న షాపులకు వెళ్లాలన్నా బైక్, కార్లపై వెళుతున్నారన్నారు. దీని కారణంగా శారీరక శ్రమకు అవకాశం ఉండటం లేదని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని నిత్యం కనీసం గంట యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ, రైతులు, వ్యవసాయ కూలీలు నిత్యం శ్రమ పడటం వలన వారు ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, పంచారామ క్షేత్ర ఈఓ బళ్ల నీలకంఠం, భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి తదితరులు పాల్గొన్నారు. సుమారు 1200 మంది యోగాకు హాజరైనట్టు ఈఓ తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీలివే..

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని రెండు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ మండల కమిటీలను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. పెద్దాపురం మండల ఉపాధ్యక్షులుగా బర్రే రామగోవిందు, బోండు శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శులుగా కేశవరపు అయ్యన్న, జేను వెంకటరమణ, కట్టా పెంటారావు, ఒబిలిశెట్టి కాశీవిశ్వనాథం, కార్యదర్శులుగా రాయి వెంకటేశ్వరరావు, ఎం.గంగాధర్, నీలం తిరుమలరావు, అల్లాడి గంగాధర్, గొర్ల అప్పారావు, పి.గంగాధర్, ఎగ్జికూటివ్ సభ్యులుగా గోకాడ శ్రీనివాసు, శేమల చిన్నబాబు, మంచినీళ్ల వెంకట్రావు, పల్లపు క్రాంతికిరణ్, బి.వెంకటరమణ, కె.శివన్నారాయణ, కె.శ్రీనివాసు, మిరియాల వెంకటేశ్వరరావు, నడిగట్ల శ్రీనివాసరావు, కట్టా రాజేష్, దేవిశెట్టి రమేష్, చీకట్ల సత్యనారాయణ, వాడ్రేవు వీరబాబు నియమితులయ్యారు.

సామర్లకోట మండలం

అలాగే సామర్లకోట మండల కమిటీని ప్రకటించారు. మండల కమిటీ ఉపాధ్యక్షులుగా నిడదవోలు రాంబాబు, దమ్మాల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శులుగా మాధగని గోవిందరావు, నక్కా శ్రీనివాసు, మలకల వరహాలబాబు, కార్యదర్శులుగా వి.వెంకటరమణ, కొప్పిరెడ్డి రాధాకృష్ణ, వీరంరెడ్డి ఆనంద్, మండపాక దొరబాబు, కేశవరపు రాంబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పి.అప్పారావు, కన్నబాబు, కోటా యోగేశ్వరరావు, యవర్న చంద్రశేఖర్, మామిడి శివ, ములసా శ్రీను, పేర్నిడి రాయుడు, మామిడి సుభాకర్, మచ్చా గోవిందు, తలాటం శ్రీను, నేర్ల కొండలరావు, బల్లిన శ్రీనును నియమించారు.

కొత్తపల్లి మండలం

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కొత్తపల్లి మండల నూతన కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మండల అధ్యక్షుడిగా అనాల సుదర్శన్, ఉపాధ్యక్షులుగా బడే హల్లెలూయ, అబ్బిరెడ్డి రాంచంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా తొమండ్ర సురేష్, రాయుడు విష్ణుమూర్తి, దాసరి పెదకాపు, మాతా కుమార్, కార్యదర్శులుగా గోగు బుజ్జి, కోన శ్యాంప్రసాద్, రాయుడు శ్యాంప్రసాద్, రాయుడు సత్తిబాబు, చింతపల్లి చల్లారెడ్డి, వేమగిరి నాని, కార్యనిర్వాహక సభ్యులుగా దడాల రాజు, పెనుమల్లు వెంకటనాగ కృష్ణారెడ్డి, వి.వీరబాబు, కోన ధనలక్ష్మి, ఎం.దుర్గాభవాని, వై.ప్రసన్నకుమార్, అనిశెట్టి భవన్ రెడ్డి, రాయుడు వెంకటరమణ, తడిచర్ల నీలకంఠం, మడుగు ప్రసన్నకుమార్, దాసరి లోకేష్ నియమితులయ్యారు. నూతన కమిటీని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ అభినందించారు.

విజ్ఞాన సోపానాలు గ్రంథాలయాలు

- గ్రంథాలయ సంస్థ కార్యదర్శి నాగరాజు



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ కార్యదర్శి నాగరాజు



పెద్దాపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

పిఠాపురం: గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పాలంకి నాగరాజు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుండి గ్రంథాలయాధికారి ఆర్ వెంకటరాము నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు సభ శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథి నాగరాజు మాట్లాడుతూ, 40 రోజుల పాటు యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, కాలిగ్రఫీ, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాల్లో విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చారన్నారు. ఇందులో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. పిఠాపురం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం మూర్తి, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం కార్యదర్శి కొండేపూడి శంకరరావు, కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం విశ్రాంత ఉప గ్రంథాలయాధికారి సలాది సాయిసత్యనారాయణ, కానిస్టేబుల్ కరుణ్‌కుమార్ తదితరులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రీసోర్స్‌పర్సన్లు దాకే ఆనందకుమార్, బి.రామకృష్ణ, పైండా శ్రీనివాసరావు, కరణం శ్రీదేవి, వెంకట్ తదితరులను సత్కరించారు.

విద్యార్థులకు మంచి పరిజ్ఞానం

పెద్దాపురం: గ్రంథాలయంలో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు మంచి పరిజ్ఞానం పొందవచ్చని ఉపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, తాడిగడప సుబ్బారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు సభ శుక్రవారం పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, 45 రోజులుగా విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠశాలల్లో చెప్పే బోధన కంటే భిన్నంగా మంచి చెడు, విచక్షణ, నైతిక విలువలు పెంపొందించుకోవడం వంటి అంశాలు ఈ శిక్షణ ద్వారా సాధ్యపడతాయన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

కొనసాగుతున్న కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

సామర్లకోట: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సామర్లకోట మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం 30వ రోజుకు చేరింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరంలో.. కాంట్రాక్ట్ కార్మికుల ఆకలి బాధలు తీర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, నెలకు రూ.13 వేలు చేతికి వస్తే, పెరిగిన ధరలతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు 15 ఏళ్లు దాటిన వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోతే రూ.10 లక్షలు, అంగవైకల్యం చెందితే రూ.ఐదు లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలనే డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఏడు నెలల క్రితం సమ్మె చేయగా, సమస్యలు పరిష్కరిస్తామని సీడీఎంఏ హామీ ఇచ్చారని, ఇప్పటివరకు సమస్యలు పరిష్కరించకపోవడంతో సమ్మె చేపట్టినట్టు నాయకులు తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు దుర్గామోహన్ ఎంపిక



సామర్లకోట: పట్టణంలోని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న టి.దుర్గామోహన్ ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్టు హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాసిన పరీక్షలలో అర్హత సాధించాడన్నారు. ఏడాదికి రూ.12 వేల వంతున నాలుగేళ్ల పాటు ఇంటర్ వరకు దుర్గామోహన్‌కు స్కాలర్‌షిప్ అందుతుందని ఎంఈఓ-2 పి.పుల్లయ్య తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన దుర్గామోహన్‌ను ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అభినందించారు.

శిక్షణతో కొత్త విషయాలపై అవగాహన

- మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: కొత్త విషయాలు తెలుసుకోవడానికి శిక్షణ అనేది ఉపకరిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులైన తమకు కూడా శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. పది మంది ఒకచోట చేరి శిక్షణ పొందే సమయంలో మంచి విషయాలు తెలుస్తాయని చెప్పారు. ఒకరికొకరు విషయ పరిజ్ఞానాన్ని పంచుకోవడంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఇప్పటి నుంచి విద్యార్థులు నిత్యం గంట సమయం గ్రంథాలయంలో గడపాలని, లేకపోతే పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి బందిల రత్నమణి అధ్యక్షత వహించారు. చెస్, డ్రాయింగ్, వ్యాసరచన, గణిత శాస్త్రం, బొమ్మల తయారీలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. రీసోర్స్‌పర్సన్ యార్లగడ్డ రాజేష్, కొమ్ము శివశంకర్, కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ప్రశ్నించేతత్వం అవసరం

- ప్రముఖ వైద్యులు అఖిల, శిరీష



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అఖిల

పెద్దాపురం: విద్యార్థులు ఆలోచనా శక్తిని పెంచుకోవాలని, ప్రశ్నించేతత్వం వారికి ఎంతో అవసరమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అఖిల, దంత వైద్య నిపుణులు డాక్టర్ జమ్మి శిరీష అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు శుక్రవారం దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. డాక్టర్ అఖిల, డాక్టర్ శిరీష మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించే అంశాలు నేర్చుకోవాలన్నారు. ప్రతి అంశంపై ప్రశ్నించే ఆలోచనతో ఉన్నప్పుడే కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయాన్ని పెంచాలన్నారు. అనంతరం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, అమృత, నమ్రత, సాయి, బంగారం, మణికంఠ, నేహ, రేణుక, అంజలి, అనూష, యోగేష్, లోకేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థులు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కొత్తపల్లి: ఉప్పాడలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను గ్రంథాలయాధికారులు టి.నళినీప్రియ, జయకృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. నిత్యం గ్రంథాలయాలను సందర్శించి, పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నళినీప్రియ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉమ్మిడి జాన్, రీసోర్స్‌పర్సన్లు శ్రీదేవి, అనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యంగా రహదారులు



ఎండ ధాటికి నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ-పిఠాపురం రోడ్డు

కొత్తపల్లి: పెరుగుతున్న ఎండలతో ప్రజలు అల్లాడుతున్నారు. భానుడి ప్రతాపానికి ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం ఏడు నుంచే భానుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఎండ తీవ్రతకు, వడగాడ్పులకు భయపడి ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. సాయంత్రం ఆరు వరకూ ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఉదయం తొమ్మిది కల్లా రోడ్లపై జన సంచారం కానరావడం లేదు. పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటుతున్నాయి. ఎండలకు ప్రజలు తగిన జాగ్రత్తలను పాటించకపోతే అనారోగ్యం తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.

శ్రద్ధ వహించాలి

ఎండలు తీవ్రంగా ఉండడం వలన గాలిలో తేమ శాతం తగ్గుతుందని నాగులాపల్లి వైద్యాధికారి సౌజన్య తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వడదెబ్బకు గురి కాకుండా ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలన్నారు. డీహైడ్రేషన్‌కు గురి కాకుండా పండ్లు, తాజా ఆహార పదార్థాలను తీసుకోవాలని చెప్పారు. రోజుకు ఐదు లీటర్ల నీటిని తాగాలన్నారు. కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు, నిమ్మకాయ, ఉప్పు కలిపిన ద్రావణం అధికంగా తాగాలన్నారు. పిల్లలు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్య కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.